www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 10 జూన్ 2023
5
వైఎస్ఆర్

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

కడప అర్బన్ : గర్భిణులు వైద్య పరీక్షలను తరచూ చేయించుకుంటూ ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఖాదరవల్లి చెప్పారు. శుక్రవారం ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్‌లో భాగంగా అక్కాయపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణుల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు రక్త, బిపి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు తగిన విశ్రాంతి తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రసవానంతరం ప్రభుత్వ సౌకర్యాల గురించి వివరించారు. డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశాలు, గర్భిణులకు సూచనలు సలహాలు ఇవ్వాలని చెప్పారు. డ్రైడే సందర్భంగా సత్తార్ కాలనీలో పలు ఇళ్లలో నీటి తొట్టెలు, డ్రమ్ములు పరిశీలించారు. వారానికి ఒకరోజు నీటిని శుభ్రపరచుకుంటూ ఒకరోజు ఆరబెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోరమ, ఎపిఎంఒ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వేడెక్కిన రాజకీయం

కడప టిడిపిలో ఆసక్తికర పోరు
టికెట్ల కోసం నేతల ఎత్తుగడలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో రాజకీయం వేడెక్కింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో అధికార వైసిపి ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి జగన్ ఆయా జిల్లాల బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ప్రతిపక్ష టిడిపిలో కదలిక మొదలైంది. జిల్లాలోని కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు టికెట్లను దక్కించుకునేందుకు ఇద్దరు నుంచి నలుగురు అభ్యర్థులు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. కడప, ప్రొద్దుటూరు టికెట్లపై ఆసక్తికరపోరు నడుస్తోంది. కడప అసెంబ్లీ టికెట్‌ను దక్కించుకునేందుకు ఐదుగురు అభ్యర్థులు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. కడప అసెంబ్లీ అభ్యర్థి గెలిచిన పార్టీయే రాష్ట్రంలో అధికారం చేపట్టిన సంగతి పలుమార్లు రుజువైన సంగతి తెలిసిందే. అధికార, ప్రతిపక్ష పార్టీలు కడప అసెంబ్లీ టికెట్‌పై ఆచితూచి వ్యవహరిస్తున్నాయనే వాదన వినిపిస్తోంది. కొలువు దీరబోయే నూతన ప్రభుత్వంలోనూ కడప అభ్యర్థి కీలకపాత్ర పోషించే అవకాశం ఉండడంతో కడప టికెట్ ప్రకటనపై ఎనలేని ఉత్కంఠ నెలకొంది. కడప అసెంబ్లీ పరిధిలో పెద్ద ఎత్తున ముస్లిమ్ మైనార్టీ సామాజికవర్గం ఓటర్లు ఉన్న నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ ముస్లిమ్ మైనార్టీ సామాజికవర్గానికి చెందిన వారికే టికెట్లు ఇస్తుండడం తెలిసిందే. ప్రతిపక్ష టిడిపి అభ్యర్థులు గత నాలుగు ఎన్నికల్లో పోల్‌మేనేజ్‌మెంట్ చేసుకోవడంలో విఫలం కావడంతో ఓటమిని ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఆఖరికి కడప అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా ఉన్న అమీర్‌బాబు పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను సక్సెస్ చేయడంలో విజయవంతం కావడంతో ముందంజలో ఉన్నారు. ఎన్నికల ఖర్చు అంశాల్లో వెనుకబడ్డారనే అపవాదును ప్రచారంలో పెట్టిన ముస్లిమేతర అభ్యర్థులు టికెట్ తెరపైకి రావడం గమనార్హం. మాజీ జడ్పీ వైస్ చైర్మన్ లక్ష్మిరెడ్డి కోడలు ఉమాదేవి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులరెడ్డి సతీమణి ఆర్.మాధవి, ప్రముఖ వైద్య నిపుణులు కృష్ణకిషోర్‌రెడ్డి, కమలాపురం ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి కుమారుడు పోటాపోటీగా తలపడుతుండడం ఆసక్తికరంగా మారింది. ప్రొద్దుటూరు టికెట్ పై గందరగోళం నెలకొంది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కడప పార్లమెంట్ అధ్యక్షులు లింగారెడ్డి, సిఎం సురేష్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మధ్య చతుర్ముఖ పోటీ నడుస్తోంది. వరదరాజులరెడ్డి పోల్‌మేనేజ్ మెంట్ చేయడంలో సమర్థుడనిగా పేరు ఉంది. ఆయనకు టికెట్ కేటాయిస్తే గట్టిపోటీ నెలకొనే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. వయసు మీరిన నేపథ్యంలో పార్టీ ఎవరి వైపు మొగ్గు చూపుతుందో తేలాల్సి ఉంది. కమలాపురం, మైదుకూరు నియోజకవర్గాల్లో టిడిపికి బలమైన నాయకత్వం ఉన్నప్పటికీ స్పష్టత కొరవడింది. టికెట్లు ఎప్పుడు ఇస్తారు, ఎవరి పేరు ప్రకటిస్తారనే అయోమయం నెలకొంది.

పంటల బీమా అమలులో విఫలం

ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

ఖరీఫ్, రబీ సీజన్‌లలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పంటల బీమా అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వరి, వేరుశనగ, పసుపు తదితర పంటలకు మద్దతు ధర కల్పించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప మార్కెట్‌యార్డులో పసుపు, వేరుశనగ ధాన్యాలను పరిశీలించి, అక్కడి రైతులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో గోధుమ తరువాత అత్యధికంగా పండించే వరి పంటకు ప్రాధాన్యత లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం వరి పంటకు క్వింటా ధర రూ.2060 నుంచి 2203 పెంచి కేవలం రూ. 143తో రైతుల ఆదాయం రెట్టింపు చేశామని ప్రకటించడం దుర్మార్గమన్నారు. కరువు పీడిత రాయలసీమలో పండించే జొన్నకు రూ.210, సజ్జకు రూ. 150, రాగి రూ.268, ప్రొద్దు తిరుగుడు పంటకు రూ. 360, పత్తికి రూ.640 పెంచామని గొప్పలు చెప్పడం దారుణమన్నారు. లక్షకు పైగా పెట్టుబడి, ఏడాది కాల పరిమితితో పండించే పసుపు పంటకు కేవలం రూ.400 ముష్టి మాదిరి విదిల్చిందన్నారు. ఒక్క పెసర పంటకు మాత్రం రూ.803 పెంచింది తప్ప మిగిలిన ఏ ఒక్క పంటపైనా రైతులకయ్యే పెట్టుబడి వచ్చే ఆదాయానికి పొంతన లేకుండా ఉందన్నారు. 2018లో ఒక టన్ను డిఎపి ధర రూ. వెయ్యి ఉండగా ప్రస్తుతం రూ.50 వేలకు పెరిగిందన్నారు. పెరుగుతున్న విత్తనాల, ఎరువుల, పురుగుమందుల ధరలతో పాటు కూలీల ఖర్చు అమాంతం పెరిగిందన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ప్రస్తుత ధరలతోపాటు కూలీల ఖర్చు, రైతు శ్రమ, కౌలు మూడు భాగాలుగా చేసి వాటిపై అయ్యే ఖర్చుకు అదనంగా 60 శాతం జోడించి కనీసం మద్దతు ధర నిర్ణయించాల్సి ఉన్నా పాలక ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయన్నారు. మోడీ అధికారంలోకి రాకముందు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని నమ్మబలికి అధికారంలోకి రాగానే వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులను కూలీలుగా మార్చి అటు రైతులను, ఇటు వినియోగదారులను ఏకకాలంలో దోపిడీ చేసేందుకు చట్టాలు తీసుకొచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక ప్రణాళిక బద్ధంగానే వ్యవసాయానికి నిధుల కేటాయింపుల్లో కోతలు విధిస్తూ, మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతను పక్కకు నెట్టి, రాయితీలపై కర్కశంగా నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కనీసం మద్దతు ధర పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, రామచంద్రారెడ్డితోపాటు రైతులు పాల్గొన్నారు.

పసుపు రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

బినామీ పేర్లతో వేల ఎకరాల భూకబ్జా

- పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-సిద్ధవటం

రాజంపేట నియోజకవర్గంలోని వైసిపి నాయకులు బినామీల పేర్లతో వేల ఎకరాలు కబ్జా చేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 121 రోజుకు చేరుకుంది. శుక్రవారం అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం సిద్ధవటం మండలంలోని చంటిగారిపల్లె విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై మూలపల్లె, సిద్ధవటం, కమ్మపాలెం, జంగాలపల్లి విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా సిద్ధవటంలో నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన భూకబ్జాలు, ప్రజలకు జరిగిన అన్యాయం, సొంత పార్టీ కార్యకర్తలే వేసిన కర పత్రాలు వేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జున్‌రెడ్డి బినామీల పేరుతో వేల ఎకరాలు కొట్టేశాడన్నారు. జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డితో కలిసి భారీగా భూకబ్జాలకు పాల్పడ్డారని విమర్శించారు. ప్రభుత్వ, పేదల భూములు కబ్జా చేస్తున్నారన్నారు. వారిద్దరూ రూ.15 కోట్లు జడ్పీ సొమ్ము కాజేశారని, జగన్ని ఆదర్శంగా తీసుకోని ఊరుకో ప్యాలస్ కట్టుకున్నారని పేర్కొన్నారు. మేడా హైదరాబాదులో ఒక ప్యాలెస్, బెంగుళూరులో మరో ప్యాలెస్, తిరుపతిలో ఒక ప్యాలెస్, రాజంపేటలో మరో ప్యాలెస్, స్వగ్రామం చెన్నాయగారిపల్లెలో మరో ప్యాలెస్ ఐదు ప్యాలెస్‌లను కట్టుకొని జగన్‌ను మించిపోయాడన్నారు. నందలూరు తన సొంత మండలమైన చెన్నాయగారిపల్లె చుట్టూ సుమారు 1000 ఎకరాల ప్రభుత్వ భూమిని తన చిన్నాన్న మేడా భాస్కర్‌రెడ్డితో కలిసి కబ్జా చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేని మించి జడ్పీ చైర్మన్ అమర్నాథరెడ్డి తమ స్వగ్రామమైన రాజంపేట మండలం ఆకేపాడులో మూడు శ్మశానాలున్న గుట్టనే ఆక్రమించి అక్కడ మైసూర్ ప్యాలెస్ లాంటి ఇల్లును కట్టి చుట్టూ వందలాది ఎకరాలు భూకబ్జాలకు పాల్పడ్డాడన్నారు. మేడా, ఆకేపాటి స్వార్థ ప్రయోజనాల కోసం రాజంపేటను సర్వనాశనం చేశారని విమర్శించారు. రాజంపేటను జిల్లా కేంద్రం కాకుండా అడ్డుకోవడం, మెడికల్ కాలేజీ రాకుండా అడ్డుకోవడం, అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయేలా చేయడం, ప్రభుత్వ భూములు కబ్జా చేయడం, మున్సిపాలిటీకి వంద కోట్లు తెస్తానని హామీ ఇచ్చి రూపాయి తేకపోవడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడా స్వార్థం వలనే అన్నమయ్య, పింఛా డ్యాంలు కొట్టుకుపోయి 38 మంది చనిపోయారన్నారు. ఇసుకని దోచేసి టిప్పర్లలో బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ ఎక్స్ పోర్ట్ చేసి కోట్లు గడిస్తున్నాడన్నారు. టి సుండుపల్లి మండలంలో ఎమ్మెల్యే తమ్ముడు ప్రభుత్వ స్థలాలైన కొండలు, గుట్టలు చదును చేసి ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నాడని విమర్శించారు. నందలూరు మండలంలో ఎమ్మెల్యే చిన్నాన్న అరాచకాలకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారారని తెలిపారు. ఆఖరికి మాట వినకపోతే అధికారుల పై దాడులు, ట్రాన్స్ ఫర్లు చేయిస్తున్నాడన్నారు. ఒంటిమిట్టను ఆంధ్రప్రదేశ్ భద్రాద్రిగా అభివృద్ధి చేసింది టిడిపి అని పేర్కొన్నారు. రూ.100 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఒంటిమిట్ట చెరువుకు సోమశిల జలాలు అందించడానికి రూ.30 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాష్ట్రంలో గ్రామ సీమలను నిర్వీర్యం చేశారని తెలిపారు. పంచాయతీల్లో బ్లీచింగ్ చల్లడానికి కూడా చిల్లిగవ్వ లేకుండా చేశారని విమర్శించారు. గ్రామ పంచాయతీలకు చెందిన రూ.8,600 కోట్లను ప్రభుత్వం దొంగిలించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ తాగునీటిమ కోసం ప్రజలు ఐదు రోజులు నిరీక్షించాల్సి దౌర్భాగ్యం పట్టిందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ఇంటింటికీ తాగునీటి కుళాయి అందజేస్తామని చెప్పారు. పంచాయతీలకు విధులు, నిధులు కల్పించి బలోపేతం చేస్తామన్నారు. సాగునీరు లేక భూములన్నీ బీళ్లుగా మారాయన్నారు. పాదయాత్రలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసలరెడ్డి, నాయకులు బత్యాల చెంగల్రాయుడు, చమర్తి జగన్‌మోహన్‌రాజు, గంటా నరహరి పాల్గొన్నారు.

పాదయాత్ర నిర్వహిస్తున్న నారాలోకేష్, నాయకులు

మాట్లాడుతున్న విఆర్ఎల సంఘం రాష్ట్ర నాయకులు అంజి

విఆర్ఎల పట్ల వివక్ష తగదు

ప్రజాశక్తి - కడప అర్బన్

విఆర్ఎల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపడం తగదని ఎపి విఆర్ఎల సంఘం రాష్ట్ర నాయకులు అంజి అన్నారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విఆర్ఎల జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 55 ఏళ్లు పైబడిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ అలంకార్ సెంటర్‌లో విఆర్ఎల దీక్షకు మద్దతు ఇస్తూ ఆనాడు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న సిఎం విఆర్ఎలను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రివర్గ సమావేశంలో విఆర్ఎల హామీలపై ఒకనిర్ణయం తీసుకుంటారేనే ఆశతో ఎదురు చూశామని, చివరికి నిరాశే మిగిలిందని వాపోయారు. హామీల అమలు కోసం భవిష్యత్తులో పోరాటాలకు సిద్ధమవుతామని పేర్కొన్నారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బి.మనోహర్ మాట్లాడుతూ శాఖ పరమైన పరీక్షలతో సంబంధం లేకుండా ఉద్యోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నామినీలకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం, అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో నాయకులు నాగేంద్ర, రమణ, వెంకటపతి, అశోక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇలియాస్, ముమ్మడి బాలిరెడ్డి

జగన్‌ను మరోసారి సిఎంను చేద్దాం

ప్రజాశక్తి - కడప

వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైసిపి గల్ఫ్, కువైట్ కన్వీనర్లు బి.హెచ్. ఇలియాస్, ముమ్మడి బాలిరెడ్డి అన్నారు. గల్ఫ్ కన్వీనర్ బి.హెచ్. ఇలియాస్ కువైట్ పర్యటన విజయవంతంగా ముగించుకోని స్వదేశానికి తిరిగి వస్తున్న సందర్భంగా శుక్రవారం కువైట్ మాలియా ప్రాంతంలోని పవన్ ఆంధ్ర రెస్టారెంట్ లో వైసిపి కువైట్ కన్వీనర్ ముమ్మిడి బాలిరెడ్డి ఆధ్వర్యంలో కువైట్ కమిటీ సభ్యులు, వైసిపి అభిమానులకు విందు ఏర్పాటు చేసి, బి. హెచ్. ఇలియాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024లో మరోసారి జగన్ మోహన్ రెడ్డిని ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలతో పాటు ప్రవాసాంధ్రులకు ఉందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి కువైట్ కమిటీ బిసి విభాగం ఇన్‌ఛార్జి రమణ యాదవ్, యువజన విభాగం ఇన్‌ఛార్జి మర్రి కల్యాణ్, ఎస్‌టి, ఎస్‌సి విభాగం ఇన్‌ఛార్జి బిఎన్ సింహ సాంస్కృతిక విభాగం ఇన్‌ఛార్జి కె. వాసుదేవరెడ్డి, గల్ఫ్ మీడియా ఇన్‌ఛార్జి షేక్ గౌస్ బాషా, కువైట్ మీడియా వైస్ ఇన్‌ఛార్జి పి .సురేష్‌రెడ్డి, పిడుగు సుబ్బా రెడ్డి, అబుతురాబ్, షేక్ సబ్దర్ హుసేన్, హరి ప్రసాద్ చౌదరి షాహుసేన్, షేక్ బాషా, లక్ష్మీ ప్రసాద్, పార్టీ సభ్యులు, అభిమానులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాల్సిందే

ప్రజాశక్తి - బద్వేలు

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని, సిపిఎస్‌కు బదులు జిపిఎస్ విధానాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం బద్వేల్ లోని స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాదన విజయకుమార్ మాట్లాడుతూ సిపిఎస్‌కు బదులుగా జిపిఎస్ విధానాన్ని అమలు చేసేందుకు బుధవారం రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలోని 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలను నీరుగారుస్తూ ఆవేదనకు గురయ్యేలా చేసిందని పేర్కొన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీనే అమలు కాకపోవడం అత్యంత బాధాకరమన్నారు. పాత పెన్షన్ పునరుద్ధరణ అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విషయం వాస్తవం కాదా అని ఆయన నిలదీశారు. పాత పెన్షన్ విధానానికి (ఒపిఎస్) గ్యారెంటీ పెన్షన్ స్కీమ్(జిపిఎస్) ప్రత్యామ్నాయం కానే కాదన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి కట్టుబడి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎస్ బదులు జిపిఎస్ విధానాన్ని అమలు చేయడమంటే కొత్త సీసాలో పాత సారా పోయడం లాంటిదేనని ఆయన పేర్కొన్నారు. రెండింటిలోనూ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ ఉందని, అలాగే షేర్ మార్కెట్ లాభనష్టాలతో ఉద్యోగుల పెన్షన్ ఆధారపడి ఉంటుందని తెలిపారు. షేర్ మార్కెట్ పై ఆధారపడి వచ్చే పెన్షన్‌కు సామాజిక భద్రత ఎలా ఉంటుందో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల కస్తూర్బా పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ఎటువంటి ప్రయోజనం ఉండదని ఆయన పేర్కొన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలిసి వచ్చే ఉద్యోగ, ఉపాధ్యాయులను కూడగట్టి ఉద్యమాలు చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం దిగి రాకపోతే తగు మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులర్ హర్షణీయం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - కడప అర్బన్



జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం పట్ల మేయర్ సురేష్‌బాబు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎం.వి.రామచంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం, ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేయర్, ఎంఎల్‌సి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీని సిఎం నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. వీరంతా సిఎంకు విధేయులుగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టాల గోల్‌మాల్‌పై విచారించాలి : సిపిఎం

పోరుమామిళ్ల టౌన్ : మండలంలోని రంగసముద్ర పంచాయతీలో సర్వే నంబర్ 1263, 1259/2లలో పట్టాల గోల్‌మాల్ సంబంధించి విచారించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎన్. భైరవప్రసాద్ పేర్కొన్నారు. నూతన తహశీల్దార్ గంగయ్యను శుక్రవారం కలిసి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పట్టాల గోల్‌మాల్‌పై తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ 1999లో మిలటరీ సిబ్బంది ఒకొక్కరికీ ఐదు సెంట్ల చొప్పున ప్రభుత్వం పై సర్వే నంబర్లలో పట్టాలిచ్చిందన్నారు. ఆ స్థలం చాలక పోవడంతో తిరిగి 2009లో అదే సర్వే నంబర్లలో మూడు సెంట్లకు కుదించి ఇచ్చారన్నారు. లబ్ధిపొందిన వారిలో కొందరు బదిలీ కారణంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారని తెలిపారు. ఇటీవల మిలటరీ సంఘం నాయకులమని చెప్పి కొందరు దొంగ పట్టాలతో నకిలీ పట్టాలు సృష్టించుకుని కబ్జాకు యత్నిస్తున్నారని తెలిపారు. దీనిపై విచారించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కంట శ్రీనివాసులు, లూర్దు మేరీ, బీబీ, కెవిపిఎస్ మండల నాయకులు సుందరయ్య, కుసలూరి రవి, రత్నమయ్య, అవాజ్ నాయకులు నజీర్, మహిళా సంఘం నాయకులు రంతున్నీ, మరియమ్మ, లక్షుమ్మ, వెంకటలక్షుమ్మ, సిద్దమ్మ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపి విస్తరణ పనులు చేపట్టాలి

కడప : పేదలకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు కడప నగరంలో, కడప - రాజంపేట వరకు రోడ్ల విస్తరణకు సంబంధించిన పనుల ు పరిశీలించడంతో పాటు నష్టపోయిన పేదలతో మాట్లాడి విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ చెన్నై నుండి ముంబై వరకు, హైదరాబాదు నుండి బెంగళూరుకు నాలుగు లైన్ల జాతీయ రహదారి మంజూరు మంజూరయ్యాయని తెలిపారు. ఇది మంచి పరిణామమే దీన్ని కాంగ్రెస్ పార్టీగా స్వాగతిస్తున్నామని చెప్పారు. రోడ్ల విస్తరణ పేరుతో నిరాశ్రయులైన వారికి, ఉపాధి కోల్పోయిన వారికి ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా ప్రత్యామ్నాయం చూపించాలన్నారు. కడప నగరంలో రోడ్ల విస్తరణ పేరుతో మద్రాసు రోడ్డు, గోకుల్ లాడ్జి, మరి ఇరుకుగా ఉన్న క్రిస్టియన్ లైను తదితర రోడ్లు విస్తరణ చేయకుండా ఆ ప్రాంతాల ధనవంతుల, వ్యాపార సముదాయాల వారి ప్రయోజనాల కోసం అధికారులు,అధికార పార్టీ లాలూచీపడి విస్తరణ చేయటం లేదు అన్నారు. పేదలు నివసించే ప్రాంతాలలో వారికి ప్రత్యామ్నాయం చూపకుండా ఆక్రమణలు అంటూ తొలగిస్తున్నారు అన్నారు.

తండ్రీ కొడుకుల మాటలు ప్రజలు నమ్మరు : వైసిపి

కడప : బాధ్యత లేని తండ్రీకొడుకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌ను ఉద్దేశించి వైసిపి రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం కడపలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిడిమిడి జ్ఞానంతో లోకేష్ మాట్లాడుతున్నారన్నారు. రాయించిన స్క్రిప్ట్ చదువుతూ పోతున్నారని పేర్కొన్నారు. జగన్ ను తిట్టడమే పనిగా పెట్టుకోవడం సరికాదన్నారు. ప్రజలకు ఏమి చేస్తారో చెప్పాల్సింది మరిచిపోయారన్నారు. మిషన్ రాయలసీమ పేరుతో లోకేష్ నిర్వహించే కార్యక్రమం ప్రవేట్ ఈవెంట్‌గా ఉందని విమర్శించారు. రాయలసీమలో అభివృద్ధి వైఎస్ఆర్‌కు ముందు, తరువాత అని చూసుకోవాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు టిడిపి ప్రభుత్వ హయాంలో పూర్తి చేయలేదన్నారు. అసలు రాయలసీమ ప్రాజెక్టుల గురించి మాట్లాడే హక్కు తండ్రి కొడుకులకు లేదన్నారు. పోతిరెడ్డిపాడు వెడల్పు చేస్తుంటే కోస్తా నాయకులతో లేఖలు రాయించారు అని అన్నారు. ఇటీవల ప్రాజెక్టు పనులు చేపడితే అడ్డుపడింది టిడిపి కదా? అని ప్రశ్నించారు. గతంలో మూడు సార్లు అవకాశం ఇస్తే ఈ రాష్ట్రానికి ఏం చేశారని ప్రశ్నించారు. కడప కొప్పర్తి పరిశ్రామిక వాడలో నాలుగేళ్లలో వెయ్యి కోట్ల కేంద్ర నిధులు వై.ఎస్. జగన్ తెచ్చారని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఉర్దూ మీడియం పాఠ్యపుస్తకాలు అందించాలని వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

జిల్లాలోని ఉర్దూ మీడియం విద్యార్థులందరికీ సకాలంలో పాఠ్య పుస్తకాలు అందించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, జిల్లా అధ్యక్షులు ముహమ్మద్ ఇర్షాద్, ప్రధాన కార్యదర్శి జాకీర్ హుసేన్ కోరారు. శుక్రవారం డిఇఒ వై రాఘవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన డిఇఒ రాష్ట్ర అధికారులతో మాట్లాడి ప్రతి విద్యార్థికీ పుస్తకాలన్నీ అందిస్తామని హామీ ఇచ్చారు. డిఇఒ పుట్టినరోజు పురస్కరించుకుని, 2018 డిఎస్‌సి ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం విజయవంతంగా నిర్వహించినందుకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్, డైరీ కమిటీ చైర్మన్ అబ్దుల్ హకీమ్ పాల్గొన్నారు.

ఆణిముత్యాలను తయారు చేయాలి : ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు ప్రతి ఒక్కరూ ప్రోత్సహం ఇచ్చి ఆణి ముత్యంలా తీర్చిదిద్దేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో రంగసముద్రం ఎంపిటిసి కల్వకూరి రమణ ఆర్థిక సాయంతో కరాటే శిక్షకులకు అవసరమైన కిట్టు కొనుగోలు చేసేందుకు ఎమ్మెల్సీ చేతులమీదుగా నగదును అంద జేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ళ, బద్వేలు ప్రాంతాల్లో మంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారి ప్రతిభ అందరికి తెలియజెప్పి, మన ప్రాంత పేరు ప్రతిష్టలు నిలపాలని కోరారు. కరాటేకు ఈప్రాంతంలో మంచి పేరు ఉందని, వారికి, క్రికెట్ శిక్షకులకు దాతలు చేయూత అందించి ప్రోత్సాహించాలన్నారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

పోరుమామిళ్ల టౌన్ : పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ చిన్నారుల బంగారు భవిష్యత్తుకు భరోసా మహబూబ్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అని అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, బద్వేల్ యువజన నాయకులు చిత్త గిరి ప్రణీత్ రెడ్డి, ఎంపిటిసి మహబూబ్ పీర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు- నేడు కార్యక్రమం కింద పాఠశాల సుందరీకరణ చేపడుతున్నామన్నారు. త్వరలో పిల్లలకు బెంచీలు సౌకర్యం స్వచ్ఛమైన ప్యూరిఫైడ్ తాగునీటి సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన, పిల్లలకు ఆరోగ్యంగా ఆనందంగా ఒత్తిడి లేకుండా చదువుకునే ప్రోత్సాహం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పీరయ్య, ఎస్ఎంసి చైర్మన్ కె. విజయభారతి, హెడ్మాస్టర్ రోశయ్య, ఉపాధ్యాయులు చిత్తా రాజానందర్ రెడ్డి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలను పనులకు పంపితే చట్టరీత్యా నేరం

కడప : తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించకుండా పనులకు పంపిస్తే చట్టరీత్యా నేరం అవుతుందని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్ కుమార్ అన్నారు. బాల కార్మికుల నిర్మూలన వేడుక సందర్భంగా శుక్రవారం కడప నగరంలోని బికెఎం, ఆర్‌కె వీధి, వై వి స్ట్రీట్, మూర్తి ఫొటో స్టూడియో సర్కిల్, ఖాదర్ ఖాన్ మసీద్ సర్కిల్, చెన్నూరు బస్టాండ్ మొదలకు ప్రాంతాల్లోని షాపులలో తనిఖీలను నిర్వహించారు. న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 1 నుండి 30వ తేదీ వరకు బాల కార్మికుల నిర్మూలన వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ వంతు బాధ్యతగా పిల్లలను చదివించాలి అన్నారు. పనులు చేయించడం చట్టరీత్యా నేరము అవుతుందన్నారు. కార్యక్రమంలో లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు మునుస్వామి, జాన్సన్, శ్రీనివాసులు రెడ్డి, డిస్టిక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ చెన్నారెడ్డి, పారా లీగల్ వాలంటరీలు సురేష్ సహాయం, కుమారి, వర కుమార్, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమమే ధ్యేయం

కడప అర్బన్ : ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమంలో ఎస్‌టియు పాత్ర ఎనలేనిదని, ఉపాధ్యాయ, విద్యారంగ సమక్షేమమే లక్ష్యమని రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వివిఆర్ ఎస్‌టియు భవన్‌లో జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి ఆధ్వర్యంలో 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రఘునాథరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఆవిర్భవించిన సంఘం ఎస్‌టియు అని తెలిపారు.ఎన్నో చారిత్రక ఉద్యమాలకు సారథ్యం వహించి, ముందుండి నడిపించిన సంఘమని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలగంగిరెడ్డి, ఇలియాస్ బాష మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో చర్చలు, పోరాటాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలకు నేటి ప్రభుత్వాలు తూట్లు పొడిచే విధంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. ముందుగా వీణా విజయరామరాజు కాంస్య విగ్రహానికి నివాళులు అర్పించిన తదనంతరం సంఘ శ్రేయస్సు కోసం కృషిచేసిన త్యాగధనుల సేవలను కొనియాడారు.

కేంద్ర గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కడప అర్బన్ : విద్యార్థులు, పరిశోధకులు విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయాన్ని వినియోగించుకొని ప్రతిభామూర్తులుగా తయారుకావాలని యోగివేమన విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్ ఆకాంక్షించారు. ఆధునీకరించిన వెబ్‌సైట్‌ను వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఎస్. రఘునాథరెడ్డి, గ్రంథాలయ బాధ్యులు ఆచార్య టి.రామ ప్రసాద్ రెడ్డితో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ విద్యార్థులు తరగతులు మినహా మిగిలిన సమయాల్లో గ్రంథాలయంలో పుస్తకాలతో స్నేహం చేయాలన్నారు. వెబ్‌సైట్‌లో ఈ కేటలాగ్‌లను సందర్శించి అవసరమైన పుస్తకాన్ని గుర్తించి గ్రంథాలయంలో ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ విద్యార్థులు చదువుకునే అద్భుత అవకాశాన్ని కల్పించామన్నారు.

కుటీర పరిశ్రమతో అధిక లాభాలు

చింతకొమ్మదిన్నె : పుట్టగొడుగుల పెంపకం ఒక కుటీర పరిశ్రమగా పెట్టి మంచి లాభాలు గడిస్తున్నారని కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరులో కెవికె సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టగొడుగులకు విలువలు జోడించి సూప్ లాగా, మసాలా పౌడర్ లాగా, ఊరగాయ లాగా తయారు చేయవచ్చని తెలిపారు. వ్యవసాయ కళాశాల తిరుపతి ప్రొఫెసర్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ పుట్టగొడుగులు మంచి ఆహారమని, వాటిలో పోషక విలువలు చాలా మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. ఏరువాక కో-ఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకంపై యువకులు ముందుకు రావాలని అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల ద్వారా యువతను ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల తిరుపతి సమన్వయకర్త డాక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి వ్యవసాయ కళాశాల కూడా విద్యార్థుల చేత పుట్టగొడుగుల పెంపకంపై ఆసక్తి కనబరిచేల్లా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అనంతరం షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక పథకం కింద 20 మందికి బ్యాటరీ స్ప్రేయర్ పంపులను అందజేశారు. కార్యక్రమంలో రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని నాగులకట్ట వీధి నుంచి రైల్వే స్టేషన్ వెళ్లే దారిలో లైట్లు ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎన్జిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో లైట్లు లేకపోవడం చేత అంధకారం ఉందన్నారు. జమ్మలమడుగు నుంచి రాత్రి ధర్మవరం, గుంటూరు రైలు ఆగుతున్నాయని రాత్రి పూట లైట్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు, భయాందోళనకు గురవుతున్నారన్నారు. మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఆ వైపు రోడ్డు కూడా దెబ్బతిందని, వాహనదారులు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారని చెప్పారు. రాత్రి పూట లైట్లు లేకపోవడంతో, రోడ్డు కూడా సరిగ్గా లేకపోవడంతో, బైక్ లలో వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. సంబంధిత అధికారులు లైట్లు వేయాలని, రోడ్డు మరమ్మతు చేయాలని డివైఎఫ్ఐ తరుపున కోరుతున్నామన్నారు. సమావేశంలో ప్రసాద్, హాజీ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పట్టణంలోని డిగ్రీ కళాశాల సమీపంలోకి ఆటోనగర్ను మార్చామని, అక్కడి ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వై.ఎస్. మనోహర్రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ సభ భవనంలో ఆటోనగర్ లో ఉంటున్న కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో నగర అభివృద్ధి కోసం కదిరి రోడ్డుకు మార్చామని తెలిపారు. ప్రజలకు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పుర చైర్మన్ డాక్టర్ వల్లపు వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆటోనగర్ కార్మికులు ఉన్నారు.

నెలాఖరులోగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల మోడల్ టౌన్లో భాగంగా నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను ఈనెల చివరినాటికి పూర్తి చే యాలని పాడా ప్రత్యేక అధికారి అనిల్కుమార్రెడ్డి అధికారులను ఆదేశిం చారు. శుక్రవారం అభివృద్ధి పనుల పురోగతిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. మెడికల్ కళాశాలలోని ఒపిడి బ్లాక్తో పాటు నర్సింగ్ కళాశాల , నగరవనం, గరుడాల డ్రెయినేజీ పనులు, స్కిల్డెవలప్మెంట్ సెంటర్, నుటెక్బయోసైన్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, శిల్పారామం అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా గుత్తేదారులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులను ఈ నెల చివరినాటికి పూర్తి చేయాలని కోరారు. జులై8న ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్రెడ్డి పులివెందుల పర్యటనలో భాగంగా ఆయన చేతుల మీదుగా ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు, గుత్తేదారులు నిర్లక్ష్యంగా పనులు చేసి జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కడప : ప్రెస్ క్లబ్ లో శనివారం ఉదయం 10 గంటలకు ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ, మహిళా ఐక్య వేదిక ఆధ్వర్యంలో 'ప్రమాదంలో రాజ్యాంగం – రాజ్యాంగాన్ని కాపాడుకోవడంలో మహిళల బాధ్యత' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ యస్సి, యస్టీ, బిసి, మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర నాయకురాలు నంది విజయలక్ష్మి తెలిపారు. ఈ సమావేశానికి పూలే అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని అనుసరించే ప్రతి ఒక్కరూ, ప్రజాసంఘాలు, కుల సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల మహిళ నాయకురాళ్లు అందరూ సమావేశంలో పాల్గొని వారి వారి అభిప్రాయాలను, కర్తవ్యాన్ని తెలియజేయాలన్నారు.

క్రైమ్ కార్నర్

ట్రాన్స్ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు

- రెండు దుకాణాలు దగ్ధం

ప్రజాశక్తి -ఖాజీపేట

కాలి బూడిదైన దుకాణ సామగ్రి

మండల పరిధిలోని పత్తూరు సమీపంలో పెట్రోల్ బంక్ దగ్గర కడప – కర్నూలు జాతీయ రహదారి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో రెండు దుకాణాలు అగ్నికి పూర్తిగా అహుతయ్యాయి. శుక్రవారం చోటు చేసుకున్న ప్రమాదంలో సుమారు రూ. 5 లక్షల విలువైన ఆస్థి నష్టం వాటిల్లిందని బాధుతులు వాపోతున్నారు. వివరాలు.. జాతీయ రహదారి సమీపంలో టీ, టిఫిన్ సెంటర్లున్నాయి. ఈ దుకాణాలకు సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ నుంచి నిప్పులు చెలరేగి టీ దుకాణం పై పడింది. ఈ క్రమంలో మంటలు పక్కనే ఉన్న టిఫిన్ దుకాణానికి వ్యాపించాయి. ప్రమాదంలో దుకాణాలకు సంబంధించి సామగ్రి అంతా బూడిదయ్యాయి. ఎండల తీవ్రత అధికంగా ఉండటం వల్ల ట్రాన్స్ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు వెలువడటంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు పేర్కొన్నారు. మైదుకూరు అగ్నిమాపక దళ సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ట్రాన్స్ఫార్మర్ వల్ల ప్రమాదం చోటుచేసుకుందని తమకు న్యాయం చేసి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

ఖాదర్పల్లిలో గడ్డివామి దగ్ధం

చాపాడు: మండల పరిధిలోని ఖాదర్పల్లె గ్రామంలో గురువారం అర్ధరాత్రి వరి గడ్డి ధగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు.. సి సామూన్ అనే రైతుకు చెందిన ఐదు ఎకరాలలోని వరిగడ్డి పూర్తిగా తగలబడి పోయిందని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేసినప్పటికీ వరిగడ్డి పూర్తిగా కాలిపోయిందని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు వరిగడ్డికి నిప్పు అంటించి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వరిగడ్డి దగ్ధంతో సుమారు రూ. 40 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొంటున్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు

ముద్దనూరు : బళ్లారి నుంచి తిరుపతి వెళ్తున్న హరిప్రియ ఎక్స్ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న కార్తీక్ నిద్ర మత్తులో రైలు నుంచి జారిపడి గాయపడ్డాడు. స్థానికుల వివరాలు ప్రకారం.. కార్తీక్ హరిప్రియ రైలులో తిరుపతికి పయనమయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున ముద్దనూరు మండలం ఓబులవారిపల్లె గ్రామ సమీపంలోకి రాగానే నిద్రమత్తులోకి వెళ్లాడు. ఆ సమయంలో రైలు నుంచి జారి కింద పడిపోయాడు. స్థాని కులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించగా చికిత్స నిమిత్తం అతన్ని ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు.

ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారంటీ

మినీ మేనిఫెస్టో పోస్టర్లను విడుదల చేస్తున్న భూపేష్రెడ్డి

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్

రాష్ట్రంలోని ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు టిడిపి మినీ మేనిఫెస్టో ద్వారా గ్యారెంటీ ఇచ్చిందని జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్ఛార్జి చదిపిరాళ్ల భూపేష్రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మినీ మేనిఫెస్టో గురించి నాయకులకు, కార్యకర్తలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ.1500 తల్లికి వందనం ద్వారా ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుతూ ఉంటే ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 15 వేలు, దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ ఉచితంగా అందిస్తారన్నారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా మహిళలు అందరికి బస్సులో టికెట్ లేని ప్రయాణం, ఆంధ్రప్రదేశ్ లోని నిరుద్యోగులకు 20 లక్షలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. ప్రతి నిరుద్యోగికి యువగళం నిధి ద్వారా నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వడం, అన్నదాత పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి రైతుకు ఏడాదికి రూ. 20వేల ఆర్థిక సహాయం చేయడంతో పాటు బిసిలకు రక్షణ చట్టం తెచ్చి వారికీ అన్ని విధాలుగా అండగ నిలబడటం టిడిపి ప్రధాన ఎజెండా అన్నారు. ప్రతి ఇంటికి మంచి నీరు పథకం ద్వారా మంచి నీటి కొళాయి కనెక్షన్ ఇవ్వడం, ఐదేళ్లలో పేదల ఆదాయం రెట్టింపు చేసి పేదలను సంపన్నులను చేయడమే ఈ మినీ మేనిఫెస్టో లక్ష్యమన్నారు. మేనిఫెస్టోని మండలాధ్యక్షులు, క్లస్టర్లు, యూనిట్ ఇన్ఛార్జులు బూత్ ఇన్ఛార్జులు, ఐటిడిపి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు, తెలుగు యువత, దేవగుడి కుటుంబ అభిమానులు ప్రతి ఇంటికి ఈ మినీ మ్యానిఫెస్టోను తీసుకుపోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు, మండలకమిటీ సభ్యులు, గ్రామ వార్డు కమిటీ సభ్యులు, జమ్మలమడుగు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

జగనన్న పాలనను ఓర్వలేక విమర్శలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- జమ్మలమడుగు

జగనన్న సంక్షేమ పాలనను చూసి ఓర్వలేకనే తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు మండలం పరిధిలోని సిరిగే పల్లె గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హత ప్రామాణికంగా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు పారిదర్శకంగా అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ కనుసన్నల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులకే సంక్షేమ పథకాలు అందాయి అని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సచివాలయ, వాలంటరీ వ్యవస్థలతో ఇంటి వద్దకే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందుతున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలుపుతున్నట్లు పేర్కొన్నారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కుళాయి రెడ్డి, వైసిపి నాయకులు అయ్యవారు, మన్యం, చంద్ర, రామిశెట్టి చంద్ర సుధాకర్ , మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

మోడీ, జగన్, బాబు 'సీమ' ద్రోహులు

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

మోడీ, జగన్, బాబు రాయలసీమకు తీరని ద్రోహం చేశారని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమకు బిజెపి శనిగ్రహం లాగా, వైసిపి, టిడిపి రాహుకేతువులగా దాపురించాయని పేర్కొన్నారు. వీరి పాలనలో రాయలసీమకు నవ మోసాలు జరిగినట్లు చెప్పారు. సంజీవని లాంటి ప్రత్యేక హోదా అమలు కాలేదని తెలిపారు. రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహాలో అభివృద్ధి ప్యాకేజీ అమలు కాలేదని అన్నారు. కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయలేదని విమర్శించారు. దుగ్గరాజపట్నం ఓడరేవు ప్రస్తావనే లేదన్నారు. శ్రీకాళహస్తి వద్ద కాంగ్రెస్ పాలనలో ప్రారంభించిన మన్నవరం విద్యుత్ పరికరాల కర్మాగారం మూతపడిందని చెప్పారు. రాయలసీమ సమగ్రాభివృద్ధి కోసం 2007–08లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసి పనులు ప్రారంభించిన కడప – రాయచోటి – మదనపల్లె – బెంగళూరు నూతన రైల్వే బ్రాడ్ గేజ్ పనులు నిలిచి పోయినట్లు చెప్పారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని తొమ్మిదేళ్లయినా తెలంగాణ నుంచి రాయలసీమకు తరలించలేదని అన్నారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని, హైకోర్టుల్లో ఎదో ఒకటి రాయలసీమలో ఏర్పాటు చేయాలన్నారు. కానీ వీరి పాలనలో ఒక్కటి కూడా రాయలసీమకు రాలేదని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులైన తెలుగుగంగ, గాలేరి నగరి, హంద్రీనీవా ప్రాజెక్టుల్లో సింహ భాగం పనులను కాంగ్రెస్ పాలనలోనే జరిగినట్లు చెప్పారు. రాయలసీమకు తీరని ద్రోహం చేసిన బిజెపి, వైసిపి, టిడిపిలకు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని తులసిరెడ్డి కోరారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

ఇసుక తరలింపును అడ్డుకుంటున్న స్థానికులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని ఇల్లూరులో పెన్నానది వద్ద ఏర్పాటు చేయబోయే ఇసుక రీచ్ను శుక్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇల్లూరు గ్రామ పరిధిలోని ఇసుక రీచ్ను ఆర్టిసి చైర్మన్ మల్లికార్జున్రెడ్డి సోదరుడు, వల్లూరు జడ్పిటిసి వీరారెడ్డికి కేటాయించినట్లు సమాచారం. శుక్రవారో రీచ్ వద్దకు సంబంధితాధికారులు శు రావడంతో ఇసుకను తరలించవద్దంటూ జెసిబిలను, అధికారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇక్కడ ఇసుకతోలడం వల్ల నీటి కోసం వేసిన బోరు మోటర్లు పనికిరాకుండా పోతున్నాయని చెప్పారు. ఇసుక లేక నదిలోని నీరు ఇంకిపోకుండా సాఫీగా పోతున్నాయని పేర్కొన్నారు. ఇసుక కోసం తీసిన గుంతల కారణంగా రజకుల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లుతుందని వాపోయారు. సర్పంచ్, గ్రామస్తులు రీచ్వద్దకు చేరుకోవడంతో ఎస్ఐ సంజీవరెడ్డి జమ్మలమడుగు డిఎస్పి నాగరాజుకు సమాచారం అందించారు. డిఎస్పి సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం కలమల్ల పోలీస్ స్టేషన్ వద్ద డిఎస్పి, తహశీల్దార్ నాగేశ్వరరావు,, ఎస్ఐతో గ్రామస్తులు భేటీ అయ్యారు.

ఉద్యోగుల సంక్షేమమే వైసిపి లక్ష్యం : రాచమల్లు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ఉద్యోగుల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ముఖ్య మంత్రి జగన్మోహన్రెడ్డి 10700 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ మేలు చేసినందుకు ఎన్జిఒ సంఘం నాయకులు రఘురామిరెడ్డి అధ్యక్ష తన శుక్రవారం ఎమ్మెల్యేను సన్మాని ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఉద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేరుస్తున్నారన్నారు. ఉద్యోగులందరూ మంచి మనసుతో 2024 ఎన్నికల్లో మద్దతిచ్చి మళ్లీ జగన్ను ముఖ్యమంత్రిని రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలన్నారు. రఘురామిరెడ్డి మాట్లాడుతూ 12వ పిఆర్సి కమిటీ వేయడం సంతోషకరమన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ వారికి రావాల్సిన జీతభత్యాలను అందరి ఉద్యోగులతో పాటు 1 రావడానికి 010 హెడ్ కిందికి తెచ్చినందకు సిఎంకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రెండు సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న సెరెండర్ లీవ్ ఎన్క్యాష్ మెంట్ను త్వరగా మంజూరు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఉమెన్వింగ్ చైర్మన్ జయమ్మ ప్రసంగించారు. కార్యక్రమంలో ఎన్జిఒ కార్యదర్శి రామసుబ్బయ్య, ఉపాధ్యక్షులు మధు, శివరామానుజ, సంధ్య, విజయమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాచమల్లును సన్మానిస్తున్న ఎన్జిఒలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి టి.లక్షుమయ్య

పిహెచ్సి సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

గర్భిణులు పిహెచ్సి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి టి.లక్షుమయ్య సూచించారు. స్థానిక పిహెచ్సిలో శుక్రవారం గర్భిణులకు పిఎంవైఎస్కె పథకంలో భాగంగా 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం పిహెచ్సిలో అన్నిరకాల వసతులున్నాయని చెప్పారు. సిబ్బంది ఆసుపత్రి ప్రసవాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. వైద్యాధికారి రాజేష్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకుంటూ రక్తహీనత లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి నెలా ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం కింద మండల పరిధిలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం గర్భిణుల కోసం అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. క్రమం తప్పకుండా అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారం పొందాలన్నారు. క్రమం తప్పకుండా వైద్యులతో పరీక్షలు చేయించు కోవాలన్నారు. గర్భిణులకు ఖాదర్పల్లె సర్పంచ్ వడ్ల సెమీంబాను, జైనుల్లా దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని వైద్యసిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీవాణి, డాక్టర్ కావ్య, గైనకాలజిస్ట్ శాంతి, సిహెచ్ఒ మహాదేవ యాదవ్, వైసిపి నాయకులు రమణయ్య, ప్రసాద్, షఫీ, సిబ్బంది భాస్కర్, రమేష్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

చెన్నూరు : శనివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని మండల ప్రజలు గమనించాలని చెన్నూరు విద్యుత్ ఎఇ రామలింగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడప 220 కెవికి విద్యుత్ సబ్స్టేషన్లో మరమ్మతుల కారణంగా చెన్నూరు, వల్లూరు మండలాల్లో విద్యుత్తు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

శుద్ధినీటి పథకం మరమ్మతులకు చర్యలు

చాపాడు : స్థానిక పిహెచ్సిలో శుద్ధి నీటి పథకంపై కప్పు గత వారం రోజుల కిందట అధిక గాలికి దెబ్బతింది. దీంతో రేకులు పూర్తిగా తొలగిపోయాయి. పిహెచ్సి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపిపి లక్ష్మయ్య శుక్రవారం శుద్ధినీటి పథకాన్ని పరిశీలించారు. అధిక గాలికి దెబ్బతిన్న పైకప్పును తిరిగి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో అధ్వానంగా ఉన్న పిహెచ్సి ఆవరణను అన్ని విధాల అభివృద్ధిపరిచామని సూచించారు. ప్రజలకు, సిబ్బంది తాగునీటి అవసరాలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజేష్ కుమార్, సిహెచ్ఒ మహాదేవ యాదవ్, సిబ్బంది భాస్కర్ పాల్గొన్నారు.

గాడిద పాలకు భలే గిరాకీ

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

గాడిద పాలు విక్రయిస్తున్న మహిళ

మన పూర్వం నుండి ఆచారంగా వస్తున్న పద్ధతులు కనుమరుగైపోయిన నేపథ్యంలో ఇటీవల కాలంలో కొంతమంది పట్టణాలలో గాడిదలను పట్టుకొని వాటి పాలు అమ్ముతూ వీధులలో తిరుగుతున్నారు. ఈ గాడిద పాలు చిన్నపిల్లలకు తాపడం వల్ల తెలివితేటలు పెరగడంతో పాటు దగ్గు, ఉబ్బస, ఆయాసం, వంటి వ్యాధులు దరిచేరవని చెబుతున్నారు. ఒకప్పుడు చాకలి వారు గాడిద వీపుపై గుడ్డల మొదలు వేసుకొని వచ్చేవారు. అప్పుడు వారిని అడిగితే గాడిదపాలు తెచ్చిస్తూ ఉండేవారు. కాలానుగుణంగా గాడిదలు కనుమరుగకపోవడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఒంటెద్దు బండ్లపై గుడ్డల మొదలు వేసుకొని వస్తున్నారు. క్రమంలో గాడిదలు కనుమరువైపోయినా వాటి పాలకు ప్రస్తుతం గిరాకీ పెరిగింది.

దొరికింది దొరికినట్టు దోచుకెళ్తున్నారు

లింగాల : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతులు తమ పొలాల వద్ద ఉంచిన పరికరాలు దొరికింది దొరికినట్టు దొంగలు దోచుకెళ్తున్నారు. పొలాల వద్ద విద్యుత్ స్టార్టర్లు, వైర్లు, పైపులు, తదితర సామగ్రిని చోరీ చేస్తున్నారు. గత వారంలో లింగాల గ్రామానికి చెందిన మునేశ్వరి అనే మహిళా రైతు తోట వద్దన నీటి సంపుకు చెందిన రెండు ఫిల్టర్లను దోచుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ. 15 వేలు ఉంటుందని బాధితురాలు వాపోయింది. అలాగే అదే గ్రామానికి చెందిన గంగాధర అనే యువ రైతు పొలం వద్ద బోరుబావిలో ఉన్న మోటారు పైపులను తీసుకెళ్లిపోయారు. ఇలా పొలాల వద్ద ఉన్న రైతు సామగ్రిని దోచుకెళుతున్నారు. ఇప్పటికే పలువురు రైతులు లింగాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై పోలీసులు స్పందిస్తూ త్వరలోనే నింది తులను పట్టుకుంటామని చెప్పారు.

1400 పుస్తకాలు బహూకరణ

కడప అర్బన్: హైదరాబాదు నగరంలో ఉంటున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ఆచార్యులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, గీతారాణి (1000 పుస్తకాలు ం 100 సిద్ధాంత గ్రంథాలు), ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి (300 పుస్తకాలు) మొత్తం 1400 పుస్తకాలను శు క్రవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథ పాలకులు జి.హరి భూషణరావు, సిబ్బంది నీలకంఠేశ్వర్లకు అంద జేశారు. ఈ సందర్భంగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఇంతవరకు గ్రంథాలయంలో లేని పుస్తకాలు ఉండడం విశేషమని అన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.P.No: 52 /2017
కె.వెంకటస్వామి, S/o రామయ్య, హిందూ, వయస్సు 67 సం॥, డోర్నెం.3/550, వైఎమ్ఆర్ కాలని, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.
...పిటిషనరు
Vs
R22. జి.సుబ్బరాయుడు, S/o సుబ్బరాయుడు, వయస్సు 45సం॥లు, సాకిన్ గ్రామం, చిన్నారెడ్డిపల్లి (చిన్నచెప్పలి), కమలాపురం మండలం.
...22వ రెస్పాండెంట్
నోటీసు
పై నెంబరు ఐ.పి.ని 22వ రెస్పాండెంట్ అయిన నీపైన మరికొందరి పైన పై పిటిషనరు పై కోర్టు యందు ఐ.పి.ని దాఖలు చేసియున్నాడు. అట్టి ఐ.పి.యందు నీకు ఏమైన ఆక్షేపణలు వున్న ఎడల పై కోర్టు యందు 26.6.2023వ తేదీన ఉదయం10.30 ని॥లకు హాజరు కావలెయును. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.
వాయిదా తేది:26/6/2023
ఆర్.మారుతి ప్రసాద్
అడ్వకేట్,
ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No: 669 /2021
డి.సుబ్బలక్ష్మి, W/o వెంకట చెన్నయ్య, 45సం॥లు, డోర్నెం.17/193, నడింపల్లి, ప్రొద్దుటూరు.
...వాది
Vs
వంకదార ప్రవీణ్కుమార్, S/o ప్రభాకర్ రావ్, హిందూ, 43సం॥, డోర్నెం.11/84, సుందరాచార్యుల వీది, ప్రొద్దుటూరు.
...ప్రతివాది
సమను/నోటీసు
పై నెంబరు దావాను వాది దావా మొత్తం వగైరాలు రా కోరి I.A.No.1012/2021 పిటిషన్ను పిటిషన్ షెడ్యూలు దాఖల ఆస్తిని జప్తీ చేయులాగున రెస్పాండెంట్/ప్రతివాది అయిన నీ పైన దాఖలు చేసి వున్నారు. అట్టి వాటిపై నీకు ఏవైనా ఆక్షేపణలు వున్న యెడల 20/6/2023 వ తేదీన ఉ॥10.30 గం॥లకు పై కోర్టు యందు స్వయంగా గానీ లాయరు గారి ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షమున ఎక్స్పార్టీగా తీర్మానించబడును అని తెలియజేయడమైనది.
వాయిదా తేది:20/6/2023
//By Order of the Court//
ఎన్.వి.వరప్రసాద్
అడ్వకేట్,
ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No.609/2020
O.S.No: 414 /2020
షేక్ ఖాజా, తండ్రి షేక్ మహమ్మద్ వయస్సు 32సం॥లు, ముస్లిం, R/o డోర్నెం.21/522 మరియు డోర్నెం.21/522–1, ఖాదర్హుస్సేన్, మసీదివీధి, ప్రొద్దుటూరు టౌన్ మరియు మున్సిపాలిటి, కడప జిల్లా. ...పిటిషనర్/వాది
Vs
షేక్ గైబుసావల్లీ, తండ్రి షేక్ జాఫర్, వయస్సు 50సం॥లు, ముస్లిం, R/o డోర్నెం.23/541, కాంపలిపుల్లన్న వీధి, ప్రొద్దుటూరు టౌన్ మరియు మున్సిపాలిటి, కడప జిల్లా.
...3వ రెస్పాండెంటు/3వ ప్రతివాది
నోటీసు
ఈ నెంబరు దావా షెడ్యూలు దాఖలు ఆస్తిపై పిటిషనరు/ వాది, రెస్పాండెంటు/ప్రతివాదులపైన ఇన్జక్షన్ కోరి దావా దాఖలు చేసి ఉంటు ఉన్నారు. అట్టి పిటిషన్, దావాలో 3వ రెస్పాండెంటు/3వ ప్రతివాదియైన మీరు 23.06.2023వ తేదీన ఉదయం 10.00గం॥లకు రాజశ్రీ కోర్టునకు హాజరై మీ తరపున ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనంతట మి మ్ములను ఎక్స్పార్టీ చేసి మీకు పరోక్షముగా తీర్మానించబడును.
//By Order of the Court//
పిటిషనరు తరపున
M.KARIMULLA ALIBEG
Advocate, Proddatur.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No: 414 /2020
షేక్ ఖాజా, తండ్రి షేక్ మహమ్మద్ వయస్సు 32సం॥లు, ముస్లిం, R/o డోర్నెం.21/522 మరియు డోర్నెం.21/522–1, ఖాదర్హుస్సేన్, మసీద్వీధి, ప్రొద్దుటూరు టౌన్ మరియు మున్సిపాలిటి, కడప జిల్లా.
...వాది
Vs
షేక్ గైబుసావల్లీ, తండ్రి షేక్ జాఫర్, వయస్సు 50సం॥లు, ముస్లిం, R/o డోర్నెం.23/541, కాంపలిపుల్లన్న వీధి, ప్రొద్దుటూరు టౌన్ మరియు మున్సిపాలిటి, కడప జిల్లా.
...3వ ప్రతివాది
దావా సమను
ఈ నెంబరు దావా షెడ్యూలు దాఖలు ఆస్తిపై వాది, ప్రతివాదుల పైన దావా దాఖలు చేసి ఉంటు ఉన్నాడు. అట్టి దావాలో 3వ ప్రతివాదియైన మీ పైన కూడా దావా దాఖలు చేసినారు. సదరు దావాలో 23.06.2023వ తేదీన ఉదయం 10.00 గం॥లకు రాజశ్రీ కోర్టునకు హాజరై మీ తరుపున ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేనంతట మిమ్ముల ను ఎక్స్పార్టీ చేసి మీకు పరోక్షముగా తీర్మానించబడును.
//By Order of the Court//
పిటిషనరు తరపున
M.KARIMULLA ALIBEG
Advocate, Proddatur.

BEFORE THE HON'BLE ASSISTANT COMMISSIONER FOR EMPLOYEES COMPENSATION ACT, KADAPA.
E.C.No.9/2021
Male Savithri & 3 Others.
...Applicants
Vs
Maddineni Siva Prasad, S/o Venkata Subbaiah, Major, Hindu, Lorryowner bearing No.AP-04-TU-8037, Residing at D.No.10/664, Bellam Mandi Street, Kadapa City and District.
...Opp.Party No.1
NOTICE
ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పై వాది యొక్క భర్త లారి ఆక్సిడెంటులో చనిపోయినందులకు గాను, పై వాదులు, పై ప్రతివాది పైన దాఖలు చేసిన పిటిషను వాయిదా 15.06.2023వ తేదీన వున్నది. కావున పై ప్రతి వాది 15.06.2023వ తేదీన మధ్యాహ్నం 3.00 గంటలకు ఖుద్దున గాని, లేక వకీలు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేనియెడల పరోక్షముగా తీర్మానించబడును.
యం.రామాంజనేయరెడ్డి
టి.శ్రీనివాసులు రెడ్డి
అడ్వకేట్స్, కడప.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.P.No: 435 /2020
టి.కిరణ్కుమార్రెడ్డి, S/o సుబ్బారెడ్డి, హిందూ, వయస్సు 34 సం॥లు, సాకిన్ గ్రామం, దేవాంగపేట వీధి, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.
...వాది
Vs
షేక్ మోహద్ సలీం, S/o సలీం పీరా, ముస్లిం, వయస్సు 36 సం॥, వ్యాపారం, డోర్నెం.21/61, రాజాజిరోడ్, ప్రొద్దుటూరు టౌన్.
...ప్రతివాది
సమన్లు
పై నెంబరులోని ప్రతివాది అయిన నీ పైన దావా మొత్తం రాకోరి దావాను దాఖలు చేసివున్నాడు. అట్టి దావా యందు నీకు ఏమైన ఆక్షేపణలు వున్న ఎడల పై కోర్టు యందు 28.6.2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరు కావలెయును. అట్లు లేనంతట పరోక్ష్యంగా తీర్మానించబడును.
వాయిదా తేది:28/6/2023
ఆర్.మారుతి ప్రసాద్
అడ్వకేట్,
ప్రొద్దుటూరు.